
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
5 జిల్లా వార్తలు
మంగళవారం 5 మార్చి 2024



భూములను పరిశీలించిన అదనపు కలెక్టర్

ఆమనగల్లు , మార్చి 4: జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ సోమవారం ఆమనగల్లులో పర్యటించారు. ఇటీవల లే అవుట్ల అనుమతులకు కొందరు దరఖాస్తు చేసుకున్నారు. అనుమతుల మంజూరు నేపథ్యంలో ఆ భూములను ప్రతిమాసింగ్ స్థానిక తహసీల్దార్ లలిత, మున్సిపల్ కమిషనర్ వసంత, పంచాయతీరాజ్ ఈఈ శ్రీనివాస్ రెడ్డి, ఇరిగేషన్ శాఖ డీఈ, ఏఈ, డీటీసీపీ, అధికారులతో కలిసి పరిశీలించారు. భూములకు సంబంధించిన రికార్డులను ప్రతిమాసింగ్ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. నిబంధనల మేరకు నడుచుకోవాలని అధికారులకు సూచించారు.

ఫిబ్రవరిలో భారీగా బంగారం పట్టివేత

- శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ముగ్గురి నుంచి రూ.6.03 కోట్ల విలువైన గోల్డ్ స్వాధీనం



పట్టుబడిన బంగారం (ఫైల్)

శంషాబాద్ రూరల్, మార్చి 4: శంషాబాద్ ఎయిర్‌పోర్టులో వివిధ దేశాల నుంచి ప్రయాణికులు ఫిబ్రవరి నెలలో అక్రమంగా తీసుకొస్తున్న బంగారాన్ని కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం కస్టమ్స్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. గత ఫిబ్రవరిలో దుబాయ్ నుంచి వచ్చిన ముగ్గురు మహిళా ప్రయాణికులను తనిఖీ చేయగా వారి వద్ద 13.61కిలోల బంగారం పట్టుబడిందన్నారు. ఈ బంగారం విలువ రూ.6.03కోట్లు ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. నిందితులు పొట్టలో, లోదుస్తుల్లో, మెర్క్యురీ కోటింగ్, చైన్స్ రూపంలో బంగారాన్ని తరలించేందుకు యత్నించారని తెలిపారు. వారిపై కేసు నమోదు చేసుకొని నిందితులను రిమాండ్‌కు తరలించామని చెప్పారు.



సీఎం సభ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

సీఎం సభను విజయవంతం చేయండి

షాద్‌నగర్, మార్చి 4: ఈ నెల 6న పాలమూరులో నిర్వహించే ప్రజా దీవెన సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజాదీవెన సభ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడారు. పాలమూరులో నిర్వహించే ఈ సభకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపారు. పదేళ్లుగా ప్రజల సమస్యలను కళ్లారా చూసిన సీఎం రేవంత్‌రెడ్డి వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన 6 గ్యారెంటీ పథకాల్లో నాలుగింటిని అమలు చేస్తుందని, పరిపాలన పరంగా ఉన్న ఇబ్బందులను అధికమించి త్వరలోనే మరో 2 గ్యారెంటీలను కూడా అమలు చేయనుందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీ చేపట్టిన న్యాయ యాత్రకు ప్రజాదీవెన సభ బాసటగా నిలుస్తుందని చెప్పారు.

లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు

గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల కేటాయింపులో అవకతవకలు జరిగాయని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లకు ఎంపిక చేసిన లబ్ధిదారుల జాబితా ఇప్పటి వరకు తన దృష్టికి రాలేదన్నారు. ఈ విషయంపై అప్పటి ప్రజా ప్రతినిధులు, అధికారులు కూడా పెద్దగా పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. అర్హులను గుర్తించి జాబితా రూపొందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు బాబర్‌ఖాన్, బాలరాజు గౌడ్, రఘు, చెంది తిరుపతిరెడ్డి, కె.చెన్నయ్య, ముబారక్, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

గొల్లుమన్న టంగటూరు

నలుగురి ప్రాణాలు తీసిన ఆన్‌లైన్ ఈజీ మనీ

- ఒకే కుటుంబానికి చెందిన తండ్రి, ముగ్గురు కుమారులు బలి
- పిల్లలకు ఉరివేసి తానూ ఆత్మహత్య చేసుకున్న రవికుమార్
- నలుగురు ఒకేసారి చనిపోవడంతో గ్రామంలో విషాదం
- ఆన్‌లైన్ ఈజీ మనీ సంస్థకు ఏజెంటుగా పనిచేసిన రవికుమార్
- శంకర్‌పల్లి, చేవెళ్ల మండలాల్లో జోరుగా ఆన్‌లైన్ మనీ పెట్టుబడులు

అత్యాశ కుటుంబాలను నడిసంద్రంలో ముంచేస్తుంది. ఈజీ మనీ పేరుతో అనేక నకిలీ సంస్థలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. మధ్య తరగతి జీవులకు ఆశలు కల్పించి వారిని నట్టేట ముంచుతున్నాయి. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు వస్తాయని భావించి వాటిలో పెట్టుబడి పెడుతున్నారు. కమీషన్ వస్తుందన్న ఆశతో తమ బంధువులు, స్నేహితులతో కూడా పెట్టుబడులు పెట్టిస్తున్నారు. కొంతకాలం ఈ వ్యవహారం సజావుగా సాగినా, తర్వాత అవాంతరాలు ఏర్పడుతున్నాయి. చివరకు ఆ సంస్థల చేతుల్లో మోసపోయామని తెలిసి లబోదిబోమంటున్నారు. సంస్థలో పెట్టుబడి పెట్టిన వారి ఒత్తిళ్లకు తట్టుకోలేక ఏజెంట్లు ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ఆన్‌లైన్ మాయాజాలంలో పడొద్దని పోలీసులు నిత్యం హెచ్చరిస్తున్నా ఇలాంటి ఘటనలు తగ్గడం లేదు. పైగా రోజురోజుకూ ఇంకా పెరిగిపోతూనే ఉన్నాయి.



చిన్నారుల మృతదేహాలను ఇంటినుంచి తీసుకొస్తున్న గ్రామస్తులు

శంకర్‌పల్లి, ఫిబ్రవరి 4 : శంకర్‌పల్లి మండలం టంగటూరు గ్రామం ఒక్కసారిగా గొల్లుమని ఏడ్చింది. ఆన్‌లైన్ ఈజీ మనీ ఒకే కుటుంబానికి చెందిన నలుగురి ప్రాణాలను బలి తీసుకుంది. దీంతో గ్రామం ఉలిక్కిపడింది. ఆ ఇంటి ఎదుట ఉంచిన నలుగురి మృతదేహాలను చూసిన వారి కంట కన్నీరు ఆగడం లేదు. ఈజీ మనీ కోసం ఓ తండ్రి చేసిన వ్యవహారంలో అభం శుభం ఎరుగని ముగ్గురు చిన్నారులు కూడా బలి కావడంతో మృతుల బంధువులు, గ్రామస్తుల రోదనలు మిన్నంటాయి. శంకర్‌పల్లి మండలం టంగటూర్ గ్రామానికి చెందిన నీరటి రవికుమార్ కుటుంబం సాఫీగా సాగుతున్న తరుణంలో అతడి జీవితంలోకి గుంటూరు నగరానికి చెందిన ఓ గుర్తు తెలియని వ్యక్తి వచ్చాడు. అతడు ఓ జీఎస్ఎన్ ఎంటర్ ప్రైజెస్ సంస్థలో రూ. లక్ష పెట్టుబడి పెడితే రూ. నెలకు రూ. 50 వేల చొప్పున 10 నెలల పాటు ఇస్తామని ఆశ చూపాడు. దీంతో తనకు కమీషన్ ఎక్కువగా వస్తుందని భావించిన రవికుమార్ ఆ సంస్థలో ఏజెంటుగా చేరాడు. శంకర్‌పల్లి మండలంలోని టంగటూరు, మోకిల, బుల్కాపూర్, మహలింగపూర్, శంకర్‌పల్లి, సంగారెడ్డి జిల్లాలోని ఎద్దుమైలారం, జుకల్ గ్రామస్తుల నుంచి కూడా ఈ ఏజెన్సీలో సుమారు 20 కోట్ల రూపాయల వరకు పెట్టుబడి పెట్టించాడు. రెండు సంవత్సరాల క్రితం వరకు ఈ వ్యాపారం సాఫీగానే కొనసాగింది. అయితే, మూడు నెలల నుండి కట్టిన డబ్బులు రాకపోవడంతో ఆందోళన చెందిన బాధితులు రవికుమార్‌పై ఒత్తిడి తేవడం ప్రారంభించారు. దీంతో తాను డబ్బులు కట్టించిన సంస్థ మోసం చేసిందని గ్రహించిన రవికుమార్ మనో వేదనకు గురయ్యాడు. ఈ నేపథ్యంలోనే రవికుమార్‌కు అతడి భార్యకు మధ్య ఆదివారం ఉదయం గొడవ జరిగింది. దీంతో తాను బతికి వృథా అని భావించిన రవికుమార్ ముగ్గురు కుమారులను చంపి తానూ ఆత్మహత్య చేసుకున్నాడు.



రోదిస్తున్న మృతుల కుటుంబ సభ్యులు



మృతుల ఇంటి వద్ద భారీగా గుమికూడిన గ్రామస్తులు



ఘటన వివరాలు సేకరిస్తున్న పోలీసులు

వారేమి చేశారు నేరం!

రవికుమార్‌కు ముగ్గురు కుమారులున్నారు. పెద్ద కుమారుడు సాయికిరణ్ (13), రెండో కుమారుడు మోహిత్‌కుమార్ (10), మూడో కుమారుడు ఉదయ్‌కుమార్ (07). వీరిలో మొదటి, రెండో కుమారులు మొయినాబాద్ మండలం చిలుకూరులోని ఎస్సీ బాలుర హాస్టల్‌లో ఉండి చదువుకుంటున్నారు. చిన్న కుమారుడు నాయనమ్మతో పాటు ఇంటి వద్దే ఉంటున్నాడు. ఆత్మహత్య చేసుకోవాలని భావించిన రవికుమార్ ఆదివారం సాయంత్రం హాస్టల్‌కు వెళ్లి ఇద్దరు పిల్లలను ఇంటికి తీసుకువచ్చాడు. అనంతరం ఆదివారం అర్ధరాత్రి ముగ్గురు పిల్లలకు ఇంట్లోనే ఊపిరి ఆడకుండా చేసి ఆ తర్వాత నైలాన్ తాడుతో ఉరివేశాడు. అనంతరం తాను కొత్తగా నిర్మిస్తున్న ఫంక్షన్ హాల్ వద్దకు వెళ్లి ఉరి వేసుకున్నాడు. అయితే, ఆన్‌లైన్ సంస్థ మోసానికి.. ఈ ముగ్గురు చిన్నారులకు ఎలాంటి సంబంధం లేకపోయినా, ఆ చిన్నారుల జీవితం ఇలా ముగిసిపోయిందే అంటూ గ్రామస్తులు గుండెలు బాదుకుంటున్నారు. అయితే, రవికుమార్‌తో గొడవ పెట్టుకొని ఆదివారం ఉదయం పుట్టింటికి వెళ్లడంతో రవికుమార్ భార్య లత ప్రమాదం నుంచి బయటపడిందని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు.

వాగులు మింగేశారు

- ఆక్రమణల్లో తీగల వాగు, గొల్ల వాగు
- చోద్యం చూస్తున్న అధికారులు



పూడ్చివేతకు గురైన తీగల వాగు

శంకర్‌పల్లి, మార్చి 4: వాగులు వంకలను కబ్జా చేస్తున్నా నీటి పారుదల శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. మండలంలోని అన్ని గ్రామాల్లో భూముల ధరలు భారీగా పెరగడంతో ఖాళీ జాగా కన్పిస్తే కబ్జా చేస్తున్నారు. జనవాడ, బుల్కాపూర్, ప్రొద్దటూర్, పిల్లిగుండ్ల, గోపలారం, మహరాజ్‌పేట్, మోకిల, దొంతన్‌పల్లి గ్రామాల్లో, శంకర్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలో పారే గొల్ల వాగు, తీగల వాగులను, నాలాలను కబ్జా చేశారు. ఇంత జరుగుతున్నా నీటి పారుదల శాఖ అధికారులు సర్వే చేయించడం లేదు. ఇరిగేషన్ శాఖలోని కిందస్థాయి సిబ్బంది కాసుల కక్కుర్తితో కబ్జాలపై అధికారులకు సమాచారం ఇవ్వడం లేదనే విమర్శలొస్తున్నాయి. వెంచర్ల యజమానులు, స్థిరాస్తి వ్యాపారులు రాకపోకలకు తీగల వాగుపై భారీ పైపులు వేసి పూడ్చివేశారు. వానకాలంలో వర్షాలకు నీరు పోయే దారి లేక పొలాలు, ఇళ్లలోకి నీరు చేరింది. ఇరిగేషన్ అధికారులు కాలువ పక్కన 9మీటర్ల వరకు బఫర్ జోన్‌గా మార్కింగ్ చేసినా వాగులకు మీటర్ దూరంలోనే నిర్మాణాలు చేస్తున్నారు. కబ్జాలపై స్థానికులు ఇరిగేషన్ అధికారులకు తెలియజేస్తున్నా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా మున్సిపల్, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు కబ్జాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకొని వాగులను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.



వాగులో వేసేందుకు తెచ్చిన పైపులు



అధికారులు పట్టించుకోవడం లేదు

సహజసిద్ధంగా పారే వాగులను కబ్జా చేస్తున్నా ఇరిగేషన్ అధికారులు తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. అక్రమార్కులు వాగులపై ప్రహరీలను నిర్మిస్తున్నా, పైపులు వేసి పూడ్చుతున్నా చూసీ చూడనట్టే వ్యవహరిస్తున్నారు. ఇరిగేషన్ అధికారులు ఇప్పటికైనా కబ్జాకు గురవుతున్న వాగులను, 9మీటర్ల బఫర్ జోన్‌ను మార్కింగ్ చేసి, పూర్తిగా సర్వే చేయించి వాటిని పరిరక్షించాలి.

- రాములు కౌన్సిలర్, ఫత్తేపూర్

కబ్జా చేస్తే ఉపేక్షించం

వాగులను కబ్జా చేసి నిర్మాణాలు చేపడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదు. బఫర్ జోన్లలో నిర్మాణాలు చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే ఏమైనా నిర్మాణాలున్నట్టు తేలితే వాటిని కూల్చివేస్తాం. కాలువలపై వంతెనలు కావాల్సిన చోట మా అనుమతులతోనే వాటిని ఏర్పాటు చేసుకోవాలి. ఎవరికి వారు ఇష్టానుసారం పైపులు వేసి వాగులను పూడ్చితే కేసులను నమోదు చేస్తాము. ఎక్కడైనా వాగులను కబ్జా చేస్తే స్థానికులు గానీ, సిబ్బంది గానీ మా దృష్టికి తేవాలి.

- రాధిక, ఏఈ, ఇరిగేషన్ శాఖ

'ధరణి' సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ



తహసీల్దార్‌తో మాట్లాడుతున్న కోదండరెడ్డి, రైతులు

యాచారం, మార్చి 4 : రైతులు ఇబ్బందులు పడకుండా వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ తీసుకుంటుందని, ఇందులో భాగంగానే ధరణి సమస్యల పరిష్కారం కోసం స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారని కిసాన్‌సెల్ జాతీయ ఉపాధ్యక్షుడు ఎం.కోదండరెడ్డి అన్నారు. సోమవారం యాచారంలో ధరణి సమస్యలపై తహసీల్దార్ టి.అయ్యప్పకు వినతిపత్రం ఇచ్చి పలు సమస్యలపై చర్చించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. కొత్త ప్రభుత్వం ధరణి సమస్యలను తహసీల్దార్, ఆర్డీవో, కలెక్టర్, సీసీఎల్ఏలకు అప్పగించిందన్నారు. వారి పరిధిలోని సమస్యలను రెవెన్యూ అధికారులు చిత్తశుద్ధితో పరిష్కరించాలని ఆయన కోరారు. రాష్ట్రంలో 2లక్షల 45వేల ధరణి సమస్యలున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. యాచారం మండలంలోని 24 పంచాయతీల్లో 2,550 సమస్యలను అధికారులు గుర్తించారని తెలిపారు. రెండెకరాల భూమి ఉంటే పోర్టల్‌లో తక్కువ భూమి చూపుతోందని, ఇలాంటి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఆర్‌డీవో, తహసీల్దార్లకు ఆదేశాలు జారీ చేసిందని కోదండరెడ్డి తెలిపారు. తాము అవసరమైతే మారుమూల గ్రామాలకు వెళ్లి రైతుల ఇబ్బందులు తెలుసుకొని వాటిని ఉన్నతాధికారులకు వివరించి రైతులను ఆదుకుంటామని కోదండరెడ్డి చెప్పారు. భూముల వివరాలు ఆన్‌లైన్‌లో సరిగా లేక చాలామంది పేద, మధ్య తరగతి రైతులు రైతుబంధు, రైతు బీమా పథకాలకు నోచుకోలేకపోతున్నారన్నారు. సీసీఎల్ఏకు వెళ్లి అధికారులకు గోడు చెప్పుకున్నా గత ప్రభుత్వంలో రైతుల ఇబ్బందులు తీరలేదని చెప్పారు. రైతుల ఇబ్బందులు వెంటనే తీర్చడంపై చొరవ తీసుకోవాలని తాము తహసీల్దార్‌కు వినతి పత్రం ఇచ్చామన్నారు. ప్రభుత్వం ఇచ్చిన పాస్ బుక్, టైటిల్ డీడ్‌ల ఆధారంగా రైతులకు పాస్ బుక్‌లు ఇవ్వాలని రెవెన్యూ అధికారులను ఆదేశించామని కోదండరెడ్డి చెప్పారు. ఈ కార్యక్రమంలో సునీల్, రైతులు ఉన్నారు.

కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషి చేయాలి

- రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి



వేం నరేందర్‌రెడ్డితో చర్చిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి

మహేశ్వరం, మార్చి 4 : పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయానికి అందరూ కలిసికట్టుగా పనిచేయాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ అనితా హరినాథ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి ఆయనను హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. మహేశ్వరం నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తేవడంతో పాటు చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పోటీచేసే అభ్యర్థి విజయానికి కృషి చేయాలని ఆయన సూచించారు. బీఆర్ఎస్ పాలనలో జిల్లాతో పాటు మహేశ్వరం నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా చిన్నచూపు చూశారన్నారు ఇకనుండి అలా కాకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చించి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కొత్త, పాత నాయకులు అందరూ సమన్వయంతో కలిసికట్టుగా పని చేసుకోవాలన్నారు. నరేందర్‌రెడ్డిని కలిసిన వారిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బేర బాలకిషన్, అరవింద్‌కుమార్, మల్లేష్, సంతోషరెడ్డి, నాగేందర్‌గౌడ్, సదానంద్‌గౌడ్ తదితరులున్నారు.

ఎన్నికల కోడ్ పకడ్బందీగా అమలు

ఆమనగల్లు, మార్చి 4: స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో కోడ్ అమలులోకి వచ్చింది. దీంతో ఆమనగల్లు మున్సిపల్ అధికారులు కోడ్ అమలుకు చర్యలు చేపట్టారు. మున్సిపల్ కమిషనర్ వసంత ఆదేశం మేరకు సోమవారం పట్టణంలోని పలుచోట్ల గోడలపై ఉన్న రాజకీయ పార్టీల పోస్టర్ల ను సిబ్బంది తొలగించారు. ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేపట్టకుండా నిఘా ఏర్పాటు చేశారు. ఎమ్మెల్సీ కోడ్ అమలుకు అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాప్రతినిధులు, నాయకులు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ కోరారు.



పోస్టర్‌పై రంగు వేస్తున్న మున్సిపల్ సిబ్బంది

అంతర్జాతీయ స్థాయిలో మొదటి బహుమతే లక్ష్యం

- హెచ్‌పీఆర్‌సీ అకాడమీ చైర్మన్ చైతన్యకుమార్
- అజీజ్‌నగర్‌లోని హెచ్‌పీఆర్‌సీలో ఇంటర్నేషనల్ అరీనా పోలో చాంపియన్‌షిప్ పోటీలు ప్రారంభం

మొయినాబాద్ రూరల్, ఫిబ్రవరి4: తమ గుర్రపు స్వారీ శిక్షణ కేంద్రంలో శిక్షన పొందిన హార్స్ రైడర్స్ ప్రపంచస్థాయిలో జరిగే పోటీల్లో మొదటి బహుమతి సాధించడమే తమ శిక్షణ సంస్థ లక్ష్యమని హైదరాబాద్ పోలో హార్స్ రైడింగ్ క్లబ్(హెచ్‌పీఆర్‌సీ) అకాడమీ చైర్మన్ చైతన్య కుమార్ తెలిపారు. సోమవారం అజీజ్‌నగర్ రెవెన్యూలోని(హెచ్‌పీఆర్‌సీ) హైదరాబాద్ పోలో హార్స్ రైడింగ్ క్లబ్‌లో గుర్రపు స్వారీ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీల్లో స్పెయిన్, అమెరికా, లగ్జెంబర్గ్ వంటి దేశాలతో పాటు భారత్ కూడా తలపడనున్నాయి. ఈ సందర్భంగా సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హెచ్‌పీఆర్‌సీ క్లబ్ చైర్మన్ చైతన్య కుమార్ మాట్లాడుతూ హెచ్‌పీఆర్‌సీలో శిక్షణ పొందిన వారు దేశ, విదేశాల్లో జరిగే పోటీలో రాణిస్తున్నారన్నారు. గుర్రపుస్వారీ నేర్చుకోవడం ద్వారా భారతదేశంలో అన్ని రంగాల్లో రాణించే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా ఇండియన్ ఆర్మీలో పనిచేసే సిబ్బందికి కూడా ఎంతో అదనపు బలం చేకురుతుందన్నారు. ఇక శుక్రవారం మహిళా దినోత్సవం సందర్భంగా క్రీడాకారిణులతో ఎగ్జిబిషన్ మ్యాచ్‌ను ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అంతర్జాతీయ పోటీలను హెచ్‌పీఆర్‌సీలో నిర్వహించడం ద్వారా పోలో హార్స్ రైడింగ్ గేమ్‌లను మరింత ప్రమోట్ చేసేందుకు ఎంతగానో దోహదపడుతాయని చైతన్యకుమార్ చెప్పారు. అజీజ్‌నగర్ రెవెన్యూలో 20 సంవత్సరాల క్రితం ఎంతో సువిశాలమైన పచ్చదనంతో కూడిన ప్రదేశంలో హెచ్‌పీఆర్‌సీ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు చైతన్య కుమార్ చెప్పారు. ఇక్కడ శిక్షణ పొందిన వారు దేశ,విదేశాల్లో రాణిస్తూ మంచి గుర్తింపు పొందారన్నారు. వారం రోజుల పాటు జరిగే ఈ పోటీలు సాయంత్రం 7 గంటల నుంచి ప్రారంభమవుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో హెచ్‌పీఆర్‌సీ కార్యదర్శి రియాజ్ అహ్మద్‌తో పాటు స్పెయిన్, అమెరికా, లగ్జెంబర్గ్, భారత జట్ల క్రీడాకారులు పాల్గొన్నారు.



క్రీడాకారులతో హెచ్‌పీఆర్‌సీ అకాడమీ చైర్మన్ చైతన్యకుమార్

రోడ్డు భద్రతపై అవగాహన

కొడంగల్, మార్చి 4: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం ఎస్ఐ భరత్‌రెడ్డి ఆదేశానుసారం హెడ్‌కానిస్టేబుల్ శివరాములుగౌడ్ విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ రాజారాం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలెపల్లి ఆలయ హుండీ లెక్కింపు


రేణుకా ఎల్లమ్మ ఆలయ హుండీని లెక్కిస్తున్న ఆలయ నిర్వాహకులు

బొంరాస్‌పేట్, మార్చి 4: తెలంగాణలో మినీ మేడారంగా పిలువబడే దుద్యాల మండలంలోని పోలెపల్లి జాతర ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. సోమవారం దేవాదాయ ధర్మదాయ శాఖ కొడంగల్ ఈవో బాల్‌రాజ్ ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు నిర్వహించారు. ఈ హుండీ లెక్కింపులో రూ.4,87,607లక్షలు రాగా గత సంవత్సరం కంటే రూ.68,817 అధికంగా వచ్చినట్లు చెప్పారు. వెండి 571గ్రాములు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ మేనేజర్ రాజేందర్‌రెడ్డి, దేవస్థాన కమిటీ చైర్మన్‌జయరాములు, కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు, అర్చకులు పాల్గొన్నారు.

వైభవంగా పల్లకీ సేవ

పోలెపల్లి ఎల్లమ్మ దేవత పల్లకీ సేవను సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. అమ్మవారి విగ్రహాన్ని పల్లకీలో ఉంచి గ్రామంలోకి చేర్చడం పల్లకీ సేవ ఉద్దేశమని ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. అమ్మవారిని ఆలయం నుంచి తిరిగి గ్రామంలోకి తీసుకెళ్లడంతో జాతర ఉత్సవాలు ముగిశాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు, గ్రామస్థులు, పరిసర గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కరాటేలో విద్యార్థిని ప్రతిభ


ప్రశంసాపత్రంతో రాపోలు నేత్రవర్షిణి

ఘట్‌కేసర్ రూరల్, మార్చి 4: మండలంలోని మర్రిపల్లిగూడకు చెందిన చిన్నారి రాపోలు నేత్ర వర్షిణి మార్షల్ ఆర్ట్స్ కరాటేలో ఉత్తమ ప్రతిభ కనబరిచింది. సికింద్రాబాద్‌లోని క్లాసిక్ గార్డెన్‌లో ఆదివారం రాత్రి విక్టరీ షోటోఖాన్ కరాటే అసోసియేషన్ ఇండియా ఆధ్వర్యంలో ఇన్విజిలేటర్ నేషనల్ ఓపెన్ మార్షల్ ఆర్ట్స్-2024 కరాటే పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో ప్రతిభ కనబర్చిన నేత్ర వర్షిణి తొలిస్థానంలో నిలిచింది. చిన్నారికి ప్రశంసాపత్రం ప్రదానం చేశారు. నేత్రవర్షిణి ఘట్‌కేసర్ ఢిల్లీ పబ్లిక్‌స్కూల్‌లో 3వ తరగతి చదువుతోంది. ఉపాధ్యాయులు, క్రీడాకారులు, స్నేహితులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు నేత్రవర్షిణిని అభినందించారు.

8 నుంచి మల్లికార్జున స్వామి ఆలయంలో
మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు



ఎక్వాయపల్లిలో మల్లికార్జునస్వామి ఆలయం

కడ్తాల్, మార్చి 4 : మండల పరిధి ఎక్వాయపల్లి సమీపంలో గల మల్లన్నగుట్టపై వెలసిన మల్లికార్జునస్వామి ఆలయం బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. శివరాత్రి సందర్భంగా ఏటా ఇక్కడ బ్రహ్మోత్సవాలను కనుల పండువగా నిర్వహిస్తారు. ఈ నెల 8వ తేదీ నుంచి 12వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు కొనసాగనున్నాయి. ఉత్సవాలకు హాజరయ్యే భక్తుల సౌకర్యార్థం ఆలయ ప్రధాన ధర్మకర్త బెల్లి ఎట్టయ్యయాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. కొండపై వెలసిన మల్లన్నస్వామి ఆలయాన్ని శోభాయమానంగా అలంకరించారు. బ్రహ్మోత్సవాలకు కడ్తాల, ఆమనగల్లు, కల్వకుర్తి, తలకొండపల్లి, యాచారం, మాల్ మండలాల నుంచి భక్తులు తరలివస్తారు. బ్రహ్మోత్సవాల వివరాలను ఆలయ నిర్వాహకుడు ఎట్టయ్య యాదవ్ వివరించారు. 8న గణపతి పూజ, పంచామృతాభిషేకం, శివపార్వతుల కల్యాణం, ఒగ్గుకథ, 9న అగ్నిగుండాలు, 10న ప్రత్యేక పూజలు, రథోత్సవం, 11న అర్చనలు, విశేష పూజలు, ఒగ్గు కథ, 12న చక్రతీర్థం తదితర కార్యక్రమాలుంటాయని వివరించారు. బ్రహ్మోత్సవాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.



ఆలయంలో కొలువు దీరిన సతీ సమేత మల్లన్నస్వామి

శివరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయాలి

- మహేశ్వరంలో ఈ నెల 7 నుంచి 11 వరకు ఉత్సవాల నిర్వహణ
- ఏర్పాట్లపై జడ్పీ చైర్‌పర్సన్ అనిత సమావేశం

మహేశ్వరం, మార్చి 4: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మహేశ్వరంలోని శివగంగ రాజరాజేశ్వరాలయంలో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేసేందుకు ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు కృషిచేయాలని రంగారెడ్డి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ తీగల అనితాహరినాథ్ రెడ్డి అన్నారు. సోమవారం మహేశ్వరం మండల పరిషత్‌లో ఇన్‌చార్జి ఎంపీపీ ఆర్.సునీత అధ్యక్షతన అధికారులతో బ్రహ్మోత్సవాలపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. చైర్‌పర్సన్ మాట్లాడుతూ మహేశ్వరం శివగంగ రాజరాజేశ్వరాలయంలో ఐదు రోజుల పాటు నిర్వహించే మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు అవసరమయ్యే ఏర్పాట్లు చేయాలన్నారు. ఆలయ కమిటీకి అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు సహకరించాలన్నారు. ఉత్సవాల సమయంలో భక్తులకు తాగునీరు, వైద్యం, రవాణ, పార్కింగ్, పారిశుధ్యం, లైటింగ్, తదితర వసతుల్లో లోటుపాట్లు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. స్థానికులే కాకుండా హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు ఆలయానికి తరలివస్తారని, ఇందుకు ఇప్పటి నుంచే ఏర్పాట్లు చేయాలని సూచించారు. బ్రహ్మోత్సవాల నిర్వహణకు జిల్లా పరిషత్ నుంచి రూ.5లక్షలు, మండల పరిషత్ నుంచి రూ.2లక్షల చొప్పున కేటాయిస్తామన్నారు. అలాగే మహేశ్వరం రాజరాజేశ్వరాలయాన్ని రానున్న రోజుల్లో పర్యాటక కేంద్రంగా తయారు చేసేందుకు తమ సహాయ సహకారాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయలక్ష్మి, ఆలయ కమిటీ చైర్మన్ అల్లె కుమార్, సీఐ హెచ్.వెంకటేశ్వర్లు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీవో రవిందర్‌రెడ్డి, ఆయా శాఖల అధికారులు, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ కూనయాదయ్య, పోతర్లసుదర్శన్ యాదవ్, కాకి ఈశ్వర్, నాయకులు దోమ శ్రీనివాస్‌రెడ్డి, అంద్యానాయక్, లాజర్, ఆజమ్, శ్రవణ్, రాఘవేందర్‌రెడ్డి, రాఖేష్‌రెడ్డి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడుతున్న రంగారెడ్డి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ అనితారెడ్డి

ప్రజావాణి ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి

కీసర, మార్చి 4 : ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులను అధికారులు సమగ్ర విచారణ జరిపి పరిష్కరించాలని డీఆర్వో హరిప్రియ అన్నారు. ఈ మేరకు సోమవారం మేడ్చల్ కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి అన్ని మండలాల నుంచి 98 ఫిర్యాదు వచ్చినట్లు ఆమె తెలిపారు. ఆయా శాఖల వారీగా వచ్చిన ఫిర్యాదులను సంబంధిత కార్యాలయాలకు అందజేస్తామని, మండల అధికారులు విచారణ జరిపి సమస్యలను పరిష్కరిస్తారని ఆమె తెలిపారు.



మేడ్చల్ కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ఫిర్యాదు స్వీకరిస్తున్న అధికారులు

సహజ వనరులను సంరక్షించాలి : కలెక్టర్‌కు బక్కని లేఖ

షాద్‌నగర్, మార్చి 4: షాద్‌నగర్ నియోజకవర్గ పరిధిలో ఉన్న సహజ వనరులు, చారిత్రక కట్టడాలను సంరక్షించాలని తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు, మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంకకు లేఖ రాశారు. నియోజకవర్గ పరిధిలో ఉన్న కుంటలు, చెరువులు, ఫీడర్ చానళ్లను కూడా వ్యవసాయేతర భూములుగా మార్చడం తహసీల్దార్లకు నిత్యకృత్యమైందని ఆందోళన వ్యక్తం చేశారు. నియోజకవర్గ పరిధిలోని చారిత్రక కట్టడాలను కూల్చడం, ప్రకృతి సౌందర్యంగా నిలిచిన బావులను కూల్చి వాటిని సెప్టిక్ ట్యాంక్‌లుగా మారుస్తున్నారని లేఖలో పేర్కొన్నారు. ఈ విషయాపై తాను పలుమార్లు అధికారులకు లిఖిత, మౌఖిక పూర్వంగా ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా మార్చే ముందు రెవెన్యూ శాఖ అధికారులు వాటి పూర్వాపరాలను తెలుసుకొని అనుమతులు ఇవ్వాలని లేఖలో నర్సింహులు కోరారు.



మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు

ఓవర్ లోడ్ లారీలను నిలిపివేయాలి



ఓవర్ లోడ్ లారీని అడ్డుకుని పోలీసుస్టేషన్‌కు తరలించిన అసోసియేషన్ ప్రతినిధులు

తాండూరు రూరల్, మార్చి 4 : తాండూరు ఏరియా నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లే సిమెంట్, నాపరాతి ముడి సరుకు ఓవర్ లోడ్ లారీలను నిలిపివేయాలని తాండూరు లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అబ్దుల్ గని, కార్యదర్శి అబ్దుల్ షకూర్ పేర్కొన్నారు. సోమవారం గౌతాపూర్ చెక్‌పోస్టు వద్ద లారీ అసోసియేషన్ ప్రతినిధులు కరన్‌కోట్ ఎస్ఐ విఠల్‌రెడ్డిని కాంగ్రెస్ నాయకుడు పి.నర్సింహులు ఆధ్వర్యంలో కలిసి ఓవర్ లోడ్ లారీలను అరికట్టాలని కోరారు. ఓవర్ లోడ్ ట్రక్కులతో రోడ్లు దెబ్బతింటున్నాయని, ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. దీంతో ఎస్ఐ స్పందిస్తూ లారీ అసోసియేషన్ ప్రతినిధులు ఓవర్ లోడ్ పేరుతో లారీలను ఆపొద్దని, సమస్యను తమ దృష్టికి తెస్తే పరిష్కరిస్తామని అన్నారు. అనంతరం పోలీసుస్టేషన్ వద్ద లారీ ఓనర్స్ ప్రతినిధులు విలేకరులతో మాట్లాడుతూ.. తాండూరులో 600 వరకు లారీలున్నాయని, వేరే రాష్ట్రాల నుంచి వచ్చే లారీల్లో సిమెంటు, నాపరాతి, ఎర్రమట్టిని ఓవర్ లోడ్‌తో తీసుకెళ్తుండడంతో పట్టణంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. రోడ్లు సైతం దెబ్బతింటున్నాయన్నారు. తాండూరు లారీలకు అద్దెలు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై కలెక్టర్, ఆర్టీఏ, ఎస్పీకి, తాండూరు ప్రాంతంలోని పెన్నా, ఇండియా, వికాట్ సాగర్, సీసీఐ, చెట్టినాడు తదితర సిమెంటు కర్మాగారాల యాజమాన్యాలకు లేఖలు రాశామన్నారు. ఎవ్వరూ పట్టించుకోవడం లేదన్నారు. సమావేశంలో అసోసియేషన్ జోనల్ సెక్రెటరీ అఫ్రోజ్, ట్రెజరర్ విజయ్ ఉన్నారు. కాగా లారీ ఓనర్ల సమస్యలపై ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లామని కాంగ్రెస్ నాయకుడు పట్లోళ్ల నర్సింహులు అన్నారు. ఓవర్‌లోడ్ లారీలను తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, రోడ్లు దెబ్బతింటున్నాయని అన్నారు. వాటిని నియంత్రించేందుకు జిల్లా ఉన్నతాధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని కోరారు.

వృథాగా పోతున్న
మిషన్ భగీరథ నీరు

- పట్టించుకోని వాటర్ మ్యాన్, పంచాయతీ సిబ్బంది
- నీటి వృథాపై గ్రామస్తులు ఆగ్రహం

దోమ, మార్చి 4: ఒక పక్క ఎండలు ముదురుతూ కొన్ని గ్రామాల్లో నీటి ఎద్దడి నెలకొంటుంటే మరికొన్ని చోట్ల పంచాయతీ సిబ్బంది, వాటర్ మెన్ నిర్లక్ష్యంతో తాగునీరు వృథాగా పోతోంది. నీటి వృథాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని పాలెపల్లి గ్రామంలో మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్ నుంచి తాగునీరు వృథాగా పోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. అధికారుల తీరుపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ట్యాంక్ నిండిన తర్వాత మోటర్ స్విచ్ బంద్ చేస్తే నీరు వృథా కాదని, ఇతర గ్రామాలకూ నీరు అందుతుందని అన్నారు. గ్రామాలకు తాగునీటి ఇబ్బందులు ఉండవంటున్నారు. వాటర్ మ్యాన్, పంచాయతీ కార్యదర్శి పట్టించుకోక నీరు వృథాగా పోతోందని గ్రామస్థులు తెలిపారు. ఇప్పటికైనా స్పందించి నీటి వృథాను అరికట్టాలని కోరారు.



ట్యాంక్ నిండి వృథాగా పోతున్న నీరు

మున్సిపాలిటీ ముందే మురుగు!

పట్టించుకోని తాండూరు బల్దియా అధికారులు



మున్సిపాలిటీ ముందు పారుతున్న మురుగు నీరు

తాండూరు, మార్చి 4 : తాండూరులో మున్సిపాలిటీ ముందు నుంచి వెళ్తున్న ప్రధాన రహదారి అది. అయితే ఈ రోడ్డుపై నిత్యం భారీగా మురుగు నీరు పారుతోంది. కళ్లముందు మురుగు పారుతున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో ప్రజలు ముక్కు మూసుకొని వెళ్తున్నారు. ఈ పరిస్థితి తాండూరు మున్సిపాలిటీ అధికారుల పనితీరుకు నిదర్శనంగా నిలుస్తోంది. తాండూరు పట్టణం విలియా మూన్ చౌరాస్తా నుంచి ఇందిరాచౌక్ మార్గంలో ఎడమ వైపు ఉన్న రోడ్డులో సోయల్ హోటల్ నుంచి రాయల్ కాంటా వరకు గత 15రోజులుగా మురుగు నీరు రోడ్డు మీద పారుతోంది. ఈ రహదారి వెంబడి వెళ్లే వారు దుర్వాసన భరించలేక ముక్కు మూసుకుంటున్నారు. మునిసిపల్ కార్యాలయం వద్దే మురుగు నీరు పారుతున్నా అధికారులు, సిబ్బంది ఏం చేస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రూ.50వేల నుంచి రూ.లక్ష లోపు ఖర్చయ్యే పనిని కూడా చేయించడం లేదని అధికారుల నిర్లక్ష్యంపై ప్రజలు మండిపడుతున్నారు. ఇప్పటికిప్పుడు డ్రెయిన్లు కట్టించకున్నా మురుగు నీరు రోడ్డుపై పారకుండా అయినా చర్యలు తీసుకోకపోవడాన్నిబట్టి అధికారుల నిర్లక్ష్యం ఎలా ఉందో తెలుస్తోంది. వీఐపీలు వెళ్లే దారీ ఇదే. టీ కొట్లకు, చిరు వ్యాపారులకు జరిమానాలు విధించే అధికారులు మురుగు నీరు వదులుతున్న హోటళ్లకు ఎందుకు విధించడంలేదని జనం ప్రశ్నిస్తున్నారు.

రూ.30కే సికింద్రాబాద్.. సేడంకు రూ.10

- తగ్గిన ప్యాసింజర్, డెమ్యూల రైలు చార్జీలు

తాండూరు, మార్చి 4 : పేద ప్రయాణికుల ప్యాసింజర్ రైళ్లు తిరిగి వచ్చాయి. కొవిడ్-19 తర్వాత రైల్వే శాఖలో అనేక మార్పులు వచ్చాయి. అప్పట్లో ప్యాసింజర్ రైళ్లను ఎక్స్‌ప్రెస్‌లుగా మార్చి ఎక్కువ చార్జీలు వసూలు చేశారు. నాలుగేళ్లుగా రైలు ప్రయాణికులు అనేక సమస్యలు ఎదుర్కొన్నారు. రైల్వేశాఖ ఎట్టకేలకు ప్యాసింజర్ రైళ్లను యథావిధిగా నడిపి పాత చార్జీలనే వసూలు చేయాలని నిర్ణయించారు. దీంతో తాండూరు నుంచి హైదరాబాద్ (నాంపల్లి), తాండూరు-సికింద్రాబాద్, కర్ణాటక రాష్ట్రంలోని సేడం, గుల్బర్గా, వాడి, యాద్గిర్, కృష్ణ, ముంబయి, పుణె వెళ్లే ప్యాసింజర్ రైళ్ల ప్రయాణికులకు చార్జీలు తగ్గాయి. తాండూరు రైల్వే స్టేషన్ నుంచి చిరు వ్యాపారులు హైదరాబాద్, సికింద్రాబాద్‌లకు రోజూ వదల మంది వెళ్తారు. కర్ణాటక రాష్ట్రం వాడి, చిత్తాపూర్ మహారాష్ట్ర పుణెలకు చిరు వ్యాపారులు వెళ్తుంటారు. వీరికి చార్జీలు తగ్గడంతో ఊరట లభించింది. తాండూరు నుంచి సికింద్రాబాద్ వెళ్లే డెమ్యూ రైలులో గతంలో రూ.50 ఉండగా ప్రస్తుతం చార్జీ రూ.30లకు తగ్గింది. పలు రైళ్లలో కనిష్ట చార్జీ రూ.10 ఉంది. ఒకటి నుంచి మూడు రైల్వే స్టేషన్ల వరకు ఇదే చార్జీతో ఉంది. తాండూరు నుంచి సేడం, తాండూరు నుంచి వికారాబాద్, తాండూరు నుంచి వాడికి రూ.10తో ప్రయాణించొచ్చు. తాండూరు మీదుగా డెమ్యూ రైలు కర్ణాటక రాష్ట్రం చిత్తాపూర్ వరకు, ఇటు సికింద్రాబాద్ వరకు నడుస్తుంది. తాండూరు నుంచి వ్యాపారపరంగా సికింద్రాబాద్, హైదరాబాద్, కర్ణాటక రాష్ట్రం షోలాపూర్, పుణె, ముంబయిలకు వెళ్తుంటారు. రైల్వే శాఖ చార్జీలు తగ్గించడంతో చిరువ్యాపారులు, సాధారణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

101 ట్రాక్టర్ల ఇసుక నిల్వ సీజ్

- కాంపౌండ్‌లో భారీగా ఇసుక కుప్పలు
- అనుమతి ఒక చోట.. డంపింగ్ మరో చోట
- పోలీసులు, మైన్స్ అధికారుల చర్యలు



చెనిగేష్‌పూర్ శివారులోని జ్యోతి బాపూలే పాఠశాల వెనుక రెవెన్యూ అధికారులు సీజ్ చేసిన 101 ట్రాక్టర్ల ఇసుక కుప్పలు

తాండూరు రూరల్, మార్చి 4 : తాండూరులోని నెహ్రూగంజ్‌లో ఇళ్లు నిర్మించే వారికి ఇసుక అనుమతులిస్తే, ఇదే అదునుగా ఇసుక మాఫియా అక్రమ నిల్వలతో వ్యాపారం చేస్తోంది. రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యంతో చెనిగేష్‌పూర్ రోడ్డులోని జ్యోతి బాపూలే పాఠశాల భవనం వెనుక చుట్టూ ప్రహరీ గల కాంపౌండ్‌లో అక్రమార్కులు ఏకంగా 101 ట్రాక్టర్ల ఇసుక డంప్ చేశారు. ఇసుక అనుమతులు మంజూరు చేసిన రెవెన్యూ అధికారులు కాగ్నా నది నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను అధికారులు పర్యవేక్షించకపోవడంతో ఇసుక వ్యాపారులు భారీ ఎత్తున డంప్ చేశారు. అయితే గత రెండు రోజులుగా పత్రికల్లో వార్తలు ప్రచురితం కావడంతో తాండూరు ఆర్డీవో శ్రీనివాసరావు, మైన్స్ ఏడీ సామ్యేల్ జాకబ్, కరన్‌కోట ఎస్ఐ విఠల్‌రెడ్డి, ప్రత్యేక దృష్టి సారించారు. అయితే తరలించే ఇసుక ట్రాక్టర్‌ను సోమవారం ఎస్ఐ పట్టుకుని పరిశీలించారు. ఇసుక అక్రమంగా డంప్ చేసింది వాస్తవమేనని తేల్చారు. అయితే ఈ విషయంపై రెవెన్యూ అధికారులకు లేఖ రాయడంతో రెవెన్యూ అధికారులు స్పందించి వెంటనే క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. 101 ట్రాక్టర్ల ఇసుక డంప్ చేసినట్లు తేలింది. సర్వే నంబర్-83లోని చెనిగేష్‌పూర్ శివారులో గల నసీర్ అహ్మద్, మున్నాజీ, నజీర్ అహ్మద్ భూమిలో 101 ట్రాక్టర్లు ఉన్నట్లు రెవెన్యూ అధికారుల విచారణలో తేలింది. ఆ ఇసుక కుప్పలను సీజ్ చేసినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో కరన్‌కోట్ ఏఎస్ఐ పవన్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

చేవెళ్ల బస్ స్టేషన్‌లో సెల్‌ఫోన్ చోరీ!

- వెంటనే ఫోన్ పే' ద్వారా రూ.15,400 డ్రా
- పీఎస్‌లో ఫిర్యాదు చేసిన బాధితుడు, పట్టించుకోని పోలీసులు

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్): చేవెళ్ల బస్టేషన్‌లో దొంగల బెడద ఎక్కువైంది. తరచూ దొంగతనాలు జరుగుతోన్నాయి. ఉచిత బస్సు ప్రయాణంతో ప్రయాణికుల సంఖ్య పెరిగి చోరీలు పెరిగాయి.మండలంలోని ఊరెళ్లకు చెందిన ఎం.నర్సింహులు ఫిబ్రవరి 27న హైదరాబాద్ వెళ్లేందుకు చేవెళ్ల బస్టేషన్‌కు వెళ్లాడు. హైదరాబాద్ వెళ్లే బస్సులన్నీ రద్దీతో వస్తున్నాయి. అప్పటికే అరగంట బస్సుల కోసం నిరీక్షించిన నర్సింహులు చివరకు రద్దీగా ఉండే బస్సును ఎక్కాడు. బస్సు ఎక్కే సమయంలో తోపులాటలో అతడి సెల్‌ఫోన్‌ను దొంగలు కొట్టేశారు. కిలోమీటర్ దూరం వెళ్లాక.. 'ఫోన్ పోయింది. బస్సు ఆపండి.' అని అరవడంతో బస్సు ఆగింది. బస్ స్టేషన్‌లో పడిపోయి ఉండవచ్చని వెంటనే బస్సు దిగి బస్టేషన్‌కు పరుగులు తీశాడు. కానీ.. ఫోన్ దొరకలేదు. దీంతో వెంటనే చేవెళ్ల పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు సిమ్ బ్లాక్ చేస్తాం.. మీరు ఇంటికి వెళ్లండని చెప్పారు. దీంతో బాధితుడు అదే రోజు సాయంత్రం అదే ఫోన్ నెంబర్‌తో ఉన్న కొత్త సిమ్‌ను కొన్నాడు. మరుసటి రోజు ఫిబ్రవరి 28న ఉదయం ఇంట్లో ఉన్న సెల్‌ఫోన్‌లో సిమ్ వేసుకున్నాడు. అంతలోనే ఫోన్‌కు(సెల్ నంబరు: 9866413605) రూ.15,500 డ్రా అయినట్లు మెసేజ్ వచ్చింది. వెంటనే పోలీస్టేషన్‌కు వెళ్లి అడగగా.. పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. నీ ఫోన్ జాగ్రత్తగా ఉంచుకోవడం తెలియాదా? అంటూ అతన్నే దబాయించారు. ఫోన్ చోరీ అయిన వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చినా పట్టించుకోలేదని, సిమ్‌బ్లాక్ చేసి ఉంటే తన ఖాతా నుంచి రూ.15,400 డ్రా అయ్యేవి కావన్నారు. బ్యాంక్ స్టేట్‌మెంట్ తీసుకోగా షాద్‌నగర్ టోల్‌గేట్ సమీపంలోని పెట్రోల్ బంకులో డబ్బు ఫోన్‌పే ద్వారా డ్రా అయినట్లు స్టేట్‌మెంట్‌లో తేలింది. తన భార్య రెండు నెలల జీతం డబ్బులు పోయినట్లు తెలిపాడు. బ్యాంక్ ఖాతాలో డబ్బు ఎక్కువగా ఉంటే ఎంతో నష్టపోయేవాడినని, పోలీసుల అజాగ్రత్త, నిర్లక్ష్యం కారణంగానే తన ఖాతా నుంచి డబ్బులు డ్రా చేశారని బాధితుడు ఆరోపించాడు.

లోక్‌సభ ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌దే జోరు!

ఉప్పల్, మార్చి 4 : రానున్న లోక్‌సభ ఎన్నికల్లోనూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ హవానే కొనసాగుతుందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో నాలుగింటిని మూడు నెలల్లోనే అమలు చేశామన్నారు. మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గ కాంగ్రెస్ కార్యకర్తల సమావేశాన్ని సోమవారం ఉప్పల్ నాయకులతో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ.. కాంగ్రెస్ గెలుపు కోసం పనిచేసే ప్రతీ కార్యకర్తకు గుర్తింపు ఉంటుందని సీఎం ప్రకటించారని గుర్తుచేశారు. రాష్ట్రంలో 17లోక్‌సభ స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులే గెలుస్తున్నారని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ, కాంగ్రెస్‌ల మధ్యే పోటీ ఉండబోతోందన్నారు. మల్కాజిగిరి నుంచి కాంగ్రెస్ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించుకో వాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు.

యాసంగి సీజన్‌కు ముందస్తు ప్రణాళిక తయారు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

వికారాబాద్, మార్చి 4 : యాసంగి సీజన్‌కు సంబంధించి ముందస్తు ప్రణాళిక తయారు చేయాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ సంబంధిత అధికారులకు ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో డీఎం సివిల్ సప్లయిస్, డీఎస్వో, వ్యవసాయ శాఖ, లీడ్ బ్యాంక్ మేనేజర్, డీఆర్డీవో జిల్లా అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో యాసంగిలో 7,700 ఎకరాల్లో వరి పంట వేశారన్నారు. ఈ విస్తీర్ణాన్ని బట్టి 1,19,350క్వింటాళ్ల వడ్లు కొనుగోలు కేంద్రాలకు వస్తాయని అంచనా వేశామన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి జిల్లాలో 126 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశించారు. సెంటర్లలో అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసుకోవాలని, సరిపడా గన్నీ బ్యాగులు తెప్పించాలని, కొనుగోలు కేంద్రాల్లో కావాల్సిన అన్ని పరికరాలు, ఇతర సౌకర్యాలు ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా పండించిన ధాన్యానికి మద్దతు ధర వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎ-గ్రేడ్ వడ్లకు రూ.2,203, కామన్ గ్రేడ్‌కు 2,083 మద్దతు ధర ప్రభుత్వం ఇస్తోందని ఉంటుందని అదనపు కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశానంతరం ఖరీఫ్ 2023-24 సీఎంఆర్ డెలవరీపై రైస్ మిలర్లతో అధికారి సమావేశాన్ని నిర్వహించారు. రైస్ మిల్లర్లు అందరూ ఖరీఫ్‌కు సంబంధించి సీఎంఆర్ రైస్‌ను వెంటనే ఎఫ్‌సీఐకి డెలివరీ చేయాలని ఆయన ఆదేశించారు. సమావేశంలో డీఎస్‌వో రాజేశ్వర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

శివరాత్రి ఉత్సవాలు ప్రారంభం

షాద్‌నగర్‌రూరల్, మార్చి 4 : ఫరూఖ్‌నగర్ మండల పరిధి రామేశ్వంలోని శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయంలో శివరాత్రి ఉత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. సోమవారం గణపతి పూజ, పుణ్యావాచకం, రుద్రహోమం, అంకురార్పణ, ధ్వజారోహణం నిర్వహించారు. భక్తుల కోసం చలువ పందిళ్లు, దర్శనానికి క్యూలైన్ల కోసం భారీ కేడ్లు, కోనేరులో నీటిని నిల్వ చేసేందుకు ఆలయ ఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో సంబంధిత అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.


షాద్‌నగర్‌రూరల్ : రామేశ్వరం దేవాలయం

మాంసం, మద్యం విక్రయాలను నిషేధించాలి

పవిత్ర పుణ్య క్షేత్రమైన రామేశ్వరంలో మాంసం, మద్యం విక్రయాలను నిషేదించాలని భక్తులు కోరుతున్నారు. మహాశివరాత్రి పర్వదినం మరుసటి రోజు నుంచి జోరుగా మాంసం, మద్యం విక్రయిలు జరుగుతాయి. శివాలయం వద్ద మాంసం విక్రయాలు జరగడం ఏంటని భక్తులు ఆందోళన చెందుతున్నారు. ఎక్సైజ్ అధికారులు మద్యం, మాంసం విక్రయాలపై దృష్టి పెట్టాలని భక్తులు కోరుతున్నారు. కాగా ప్రతి ఏడాది తహసీల్దార్ అధ్యక్షతన అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి ఉత్సవాల ఏర్పాట్లపై చర్చించేవారు. రెండేళ్ల నుంచి సమావేశాలు నర్విహించడం లేదని పలువురు విమర్శిస్తున్నారు.


చౌదరిగూడ : మహాపడిపూజలో స్వాములు

భక్తి శ్రద్ధలతో పడిపూజ

షాబాద్ : మండల పరిధిలోని సాయిరెడ్డిగూడ గ్రామంలో శంకరయ్య స్వామి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ద్వాదశ జ్యోతిర్లింగ మహా పడిపూజ సోమవారం కన్నుల పండువగా జరిగింది. అనంతరం శివస్వాములు ఇరుముడి కట్టుకొని శ్రీశైలం బయలు దేరారు. స్వాములు, గ్రామస్థులు పాల్గొన్నారు.

చౌదరిగూడ : మండల పరిధిలోని చెన్నారెడ్డిగూడలో ద్వాదశ జ్యోతిర్లింగ మహాపడిపూజ జరిగింది. గురుస్వామి భూపాలచారి ఆధ్వర్యంలో సోమవారం ఆకారపు శ్రీనివాస్ ఫౌల్ట్రీఫాంలో శివస్వాములు భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. శివస్వాములు వెంకట్‌రాములు, నర్సింలు, నాగరాజు, యాదయ్య, రామకృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా ఎల్లమ్మ బోనాలు

కొత్తూర్ : మండల పరిధిలోని పెంజర్ల గ్రామంలో సోమవారం ఎల్లమ్మ బోనాలను గ్రామస్థులు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా తరలివెళ్లి అమ్మవారికి సమర్పించారు. శివసత్తుల పూనకాలతో ఊరేగింపు కొనసాగగా, ఆలయలో ఆవరణలో కళాకారులు ఒగ్గు కథను వినిపించారు. మేకలు, కోళ్లను బలిచ్చి మొక్కులు తీర్చుకున్నారు. మామిడి సిద్దార్థరెడ్డి, మందకుమార్, శ్రీను, శ్రీకాంత్‌రెడ్డి, చిన్నపోచమ్మ, శంకర్, కృష్ణ, రమేష్, బాల్‌రాజ్, కుమార్, మల్లేష్ పాల్గొన్నారు.


కొత్తూర్ : పూజలు నిర్వహిస్తున్న భక్తులు

సీఎంకు ఎమ్మెల్యే ఘన స్వాగతం


సీఎం రేవంత్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే రంగారెడ్డి, చిలుక మధు

ఇబ్రహీంపట్నం, మార్చి 4 : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం మధ్యాహ్నం రామోజీ ఫిలింసిటీకి వచ్చిన సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చిలుక మధుసూదన్‌రెడ్డి శాలువా కప్పి ఆయనకు స్వాగతం పలికారు.

పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు


టీకాలు వేస్తున్న డాక్టర్ విజయ్‌కుమార్

ఆమనగల్లు, మార్చి 4 : మండల పరిధిలోని మంగళపల్లి గ్రామంలో సోమవారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఆమనగల్లు పశువైద్యాధికారి డాక్టర్ విజయ్‌కుమార్ ప్రారంభించారు. పశువైద్య సిబ్బంది రెండు బృందాలు గా ఏర్పడి ఆవులు, గేదెలకు టీకాలు వేశారు. 322 ఆవులు, 25 గేదెలకు టీకాలు వేసినట్లు డాక్టర్ విజయ్‌కుమార్ తెలిపారు. మండలంలోని రైతులందరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజయ్‌కుమార్ సూచించారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది మల్లీశ్వరి, దేవి, పాలాక్ష, శివలింగం, రమేశ్, ప్రకాశ్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన చేవెళ్ల ట్రాఫిక్ సీఐ


బాధ్యతలు స్వీకరిస్తున్న సీఐ

చేవెళ్ల, మార్చి 4 : చేవెళ్ల ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ నూతన సీఐ వెంకటేశం సోమవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. చందానగర్ పోలీస్‌స్టేషన్‌లో డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించిన ఆయన బదిలీపై చేవెళ్ల ట్రాఫిక్ సీఐగా వచ్చారు. కాగా ఇక్కడ పని చేసిన సీఐ సైదులు నగరంలోని గోల్కొండ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయ్యారు.

చేవెళ్లలో బీఆర్ఎస్ జెండా ఎగరాలి


కేటీఆర్‌తో శ్రీనివాస్‌గౌడ్

షాబాద్, మార్చి 4 : రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్ల గడ్డపై బీఆర్ఎస్ జెండా ఎగరాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. సోమవారం తెలంగాణ భవన్‌లో సర్పంచుల సంఘం జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ కేటీఆర్‌ను కలిశారు. పార్టీలో కష్టపడి పని చేసిన వారికి మంచి భవిష్యత్ ఉంటుదని, చేవెళ్ల ఎంపీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు.

దాహార్తిని తీరుస్తున్న అంబలి కేంద్రం


అంబలి పంపిణీ చేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

కడ్తాల్, మార్చి 4: మండల కేంద్రంలోని పాలశీతలీకరణ కేంద్రం ఎదుట ఏర్పాటు చేసిన అంబలి కేంద్రం ప్రయాణికులు, బాటసారుల దాహార్తిని తీరుస్తోంది. ఆమనగల్లు లయన్స్‌క్లబ్, గంప లక్ష్మయ్య ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అంబలి కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. వంద రోజుల పాటు ఈ కేంద్రాన్ని కొనసాగిస్తామని నిర్వాహకులు లయన్స్‌క్లబ్ జిల్లా మాజీ గవర్నర్ జి. చెన్నకిషన్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్ చెప్పారు. సోమవారం సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి సందర్శించారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు యాచారం వెంకటేశ్వర్లుగౌడ్, కార్యదర్శి గోవర్ధన్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ గురిగళ్ల లక్ష్మయ్య, రామచంద్రయ్య, రాజు, పాండు, ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం


ఆర్థికసాయం అందజేస్తున్న నాయకులు

తలకొండపల్లి , మార్చి 4 : మండల పరిధిలోని జూలపల్లి గ్రామానికిచెందిన మల్లేశ్ అనారోగ్యంతో మృతి చెందగా అతని కుటుంబాన్ని సోమవారం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు డోకూరు ప్రభాకర్‌రెడ్డి పరామర్శించారు. మృతుని కుటుంబానికి రూ.3 వేలు ఆర్థిక సాయం అందజేశారు. రమేశ్, శ్రీను, పర్వతాలు, నర్సింహా తదితరులు ఉన్నారు.

ధరణి దరఖాస్తుల పరిశీలన


కొత్తపేటలో ధరణి దరఖాస్తులను పరిశీలిస్తున్న తహసీల్దార్ అజాంఅలీ

కేశంపేట, మార్చి 4 : ధరణి సమస్యలపై బాధిత రైతుల దరఖాస్తులను సోమవారం కేశంపేట తహసీల్దార్ మీర్ అజాంఅలీ పరిశీలించారు. రైతులు భూ సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు. సోమవారం కొత్తపేట, సంతాపూర్, చింతకుంటపల్లి, ఎక్లాస్‌ఖాన్‌పేట గ్రామాల్లో ధరణి దరఖాస్తులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ భూ సమస్యలు, దరఖాస్తుల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం క్షేత్ర స్థాయిలో టీంలను ఏర్పాటు చేసిందని చెప్పారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. డీటీ గీతా, ఆర్ఐ నివేదిత, రెవెన్యూ సిబ్బంది, మాజీ సర్పంచ్‌లు నవీన్‌కుమార్, అంజయ్య మండల కో ఆప్షన్ సభ్యుడు జమాల్ ఖాన్, నరేష్, యాదయ్యగౌడ్ పాల్గొన్నారు.

పల్స్ పోలియోపై ఇంటింటి సర్వే

కేశంపేట్, మార్చి 4 : పల్స్‌పోలియో కార్యక్రమంలో భాగంగా మండలంలో నిర్వహిస్తున్న ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని షాద్‌నగర్ డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి పరిశీలించారు. కాగా రెండవ రోజూ పల్స్ పోలియో కొనసాగింది. సోమవారం మండల పరిధిలోని సంగెం, ఎక్లాస్‌ఖాన్‌పేట్, కొత్తపేట గ్రామాల్లో చేపట్టి ఇంటింటి సర్వేను ఆమె పరిశీలించారు. ఏఒక్క ఇంటినీ వదలిపెట్టకుండా పిల్లల వివరాలు సేకరించి, వేసుకోని వారికి పోలియో చుక్కలు వేయాలని సిబ్బందికి సూచించారు.


చౌదరిగూడ : ఇంటింటి సర్వేలో సిబ్బంది


కేశంపేట్ : పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో

ఆప్తమాలజిస్ట్ అధికారి శ్రీహరి, హెల్త్‌ఎడ్యుకేటర్ శ్రీనివాస్‌తోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

చౌదరిగూడ : మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో రెండవ రోజు పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా వైద్యసిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహించారు. సోమవారం మండలంలో 143 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేసినట్లు డాక్టర్ తబసుమ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది ప్రభులింగం, వెంకటేశ్వర్లు, అంగన్వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రైస్తవులపై దాడులను నివారించాలి


నిరసన తెలుపుతున్న క్రైస్తవులు

చేవెళ్ల, మార్చి 4 : క్రైస్తవులపై జరుగుతున్న దాడులను ప్రభుత్వం నివారించాలని ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫాలోషిప్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు టీడీఎస్. మని అన్నారు. సోమవారం చేవెళ్ల మండల కేంద్రంలో క్రైస్తవులు నిరసన తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ. క్రైస్తవులపై రాష్ట్ర వ్యాప్తంగా అక్కడక్కడ దాడులు జరుగుతున్నాయని చెప్పారు. క్రైస్తవుల రక్షణ కోసం ప్రత్యేక చట్టం తీసుకురావాలని ప్రభుత్వాన్ని కోరారు. శంకర్‌పల్లి మండలంలోని జన్వాడ గ్రామంలో క్రైస్తవులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలన్నారు. అలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో క్రిష్టఫర్, యేసుదాస్, సామ్యేల్, జహంగీర్, డానియల్, తదితరులు పాల్గొన్నారు.

వీఆర్ఏల సమస్యలు పరిష్కరించాలని వినతి


కోదండరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న వీఆర్ఏలు

యాచారం, మార్చి 4 : చాలా కాలంగా పరిష్కారం కాకుండా ఉన్న సమస్యలను పరిష్కరించి తమను ఆదుకోవాలని వీఆర్ఏలు కిసాన్‌సెల్ జాతీయ ఉపాధ్యక్షుడు ఎం. కోదండరెడ్డిని కోరారు. మండలంలోని వివిధ గ్రామాల వీఆర్ఏలు సోమవారం యాచారంలో ఆయనను కలిసి వినతిపత్రం ఇచ్చారు. వీఆర్ఏలు మరణిస్తే వారి కుటుంబంలో ఒకరికి కారుణ్య నియామకం ద్వారా ఉపాధి కల్పించి ఆదుకోవాలని కోరారు. తమ వేతనాలు పెంచడం కోసం చొరవ తీసుకోవాలని చెప్పారు. ఖాళీగా ఉన్న వీఆర్ఏ పోస్టులు భర్తీ చేయాలని అన్నారు. తమకు పేస్కేల్ వర్తింపజేసి, గుర్తింపుకార్డులందించాలని కోరారు.

ఘనంగా సీతల్‌సాత్ మహారాజ్ ఆలయ వార్షికోత్సవాలు


పూజలు చేస్తున్న కృష్ణారెడ్డి, జంగారెడ్డి, తదితరులు

కందుకూరు, మార్చి 4 : మండలంలోని దావుత్‌గూడలో సోమవారం సీతల్‌సాత్ మహారాజ్ ఆలయ వార్షికోత్సవాలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఆ గ్రామ పూజారి ఆర్.రుక్మన్‌నాయక్ ఆధ్వర్యంలో గిరిజన సంస్కృతి, సాంప్రదాయాలతో జరిగిన ఈ వేడుకల్లో మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, పీసీసీ సభ్యుడు ఏనుగు జంగారెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ఎస్ కృష్ణానాయక్, మండల సహకార సంఘం మాజీ చైర్మన్ సరికొండ మల్లేష్, పులిమామిడి మాజీ సర్పంచ్ ఆనేగౌని అంజయ్యగౌడ్, దావుత్‌గూడ మాజీ సర్పంచ్ విజయరాజునాయక్, ఎంపీటీసీ రాజమ్మ, సంతోష్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

మానసికోల్లాసానికి క్రీడలు దోహదం


బహుమతులు ప్రదానం చేస్తున్న స్వప్నరవీందర్

మహేశ్వరం, మార్చి 4 : మానసికోల్లాసంతో పాటు శరీరదారుఢ్యానికి క్రీడలు ఎంతో దోహదపడుతాయని డబిల్‌గూడ మాజీ సర్పంచ్ బి. శంకర్, ఎంపీటీసీ టి. స్వప్నరవీందర్ అన్నారు. డబిల్‌గూడలో నిర్వహించిన డీపీఎల్ సీజన్ 7 క్రికెట్ టోర్నమెంట్ సోమవారం ముగిసింది. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులు ప్రదానం చేసిన అనంతరం వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. గ్రామస్థాయి నుంచి జాతీయ స్థాయికి ఎదిగాలన్నారు. ఐ. పాండు, ఎ.రాములు, పి.ప్రసాద్, ఎ. ప్రకాష్, కె. జంగయ్య, ఓంప్రకాష్, కరుణాకర్, బి. యాదయ్య ఉపేందర్, బాలకృష్ణగౌడ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నేతకు పరామర్శ


పరామర్శిస్తున్న పత్యనాయక్, నాయకులు

ఆమనగల్లు, మార్చి 4 : బీఆర్ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి తల్లోజు రామకృష్ణ తండ్రి రామస్వామి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా సోమవారం జిల్లా, విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు నేనావత్ పత్యనాయక్ ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆయన వెంట ఉప్పుల రాములు, సరితపంతూనాయక్, రమేశ్ నాయక్, మల్లేశ్ నాయక్, గణేశ్ నాయక్ ఉన్నారు.

క్రైం కార్నర్

రైలుకింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

కొత్తూర్, మార్చి 4 : కొత్తూర్ మండల పరిధిలోని తిమ్మాపూర్ సమీపంలో సోమవారం ఉదయం గుర్తుతెలియని రైలు డోర్ నుంచి జారి పడి గుర్తుతెలియని ఓ యువకుడు మృతి చెందాడని రైల్వే హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్ తెలిపారు. మృతుడికి 25-30 సంవత్సరాల మధ్య వయస్సు ఉంటుందని, గ్రే కలర్ పాయింట్, గ్రీన్ కలర్ షర్టు, మెరూన్ కలర్ టీషర్టు ధరించి ఉన్నాడని ఆయన చెప్పారు. మృతదేహాన్ని శవపరీక్ష కోసం షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించామని అన్నారు. తిమ్మాపూర్ స్టేషన్ మాస్టర్ విజయ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు శ్రీనివాస్ తెలిపారు. మృతుడి ఆచూకి తెలిసిన వారు 9441407039, 9848090426 ఫోన్ నెంబర్లకు సమాచారం అందించాలని అన్నారు.

కోడిపందెం ఆడుతున్న 12 మంది అరెస్టు


పోలీసులకు పట్టుబడిన కోడిపందెం రాయుళ్లు

మొయినాబాద్, మార్చి 4 : కోడిపందెం ఆడుతున్న వారిని పోలీసులు అరెస్టు చేసిన సంఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని సురంగల్ గ్రామంలోని కృష్ణరెడ్డి మాన్‌సోగార్డెన్ ఫామ్‌హౌస్‌లో హైదరాబాద్‌కు చెందిన కొందరు వ్యక్తులు డబ్బులు పెట్టి కోడిపందెం ఆడుతున్నట్లు సమాచారం రావడంతో పోలీసులు ఆ ఫామ్‌హౌస్‌పై దాడి చేశారు. అక్కడ కోడిపందెం ఆడుతున్న 12 మందిని అదుపులోకి తీసుకోవడంతో పాటు వారి నుంచి రూ. 1,01470 నగదుతో పాటు మూడు కార్లు, 12 సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చాఫ్ కట్టర్స్‌కు అనుమతి ఇవ్వాలి


సమావేశంలో మాట్లాడుతున్న దండు యాదవరెడ్డి, తదితరులు

షాబాద్, మార్చి 4 : మండలంలోని పాడిరైతులు పొలాల వద్ద చాఫ్ కటర్స్ వాడుకోవడానికి విద్యుత్‌శాఖ అధికారులు అనుమతి ఇవ్వాలని భారతీయ కిసాన్ సంఘ్ మండల అధ్యక్షుడు దండు యాదవరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో సోమవారం రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువుల మేత కోసం చాఫ్‌కట్టర్‌లను వాడుతున్న రైతుల నుంచి విద్యుత్ అధికారులు జరిమానా వసూలు చేస్తున్నారని చెప్పరు. చాఫ్‌కట్టర్‌ల కోసం పాడి రైతులు డీడీలు చెల్లిస్తారని, వాటికి అనుమతి ఇవ్వాలని విద్యుత్ శాఖ అధికారులను కోరారు. సమావేశంలో సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు సత్యనారాయణరెడ్డి, రైతులు వెంకట్‌రెడ్డి, చంద్రయ్యగౌడ్, మల్లయ్య, చంద్రబాబు, గౌతం , తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం


స్వయం పరిపాలన దినోత్సవంలో విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఆమనగల్లు, మార్చి 4 : మండల పరిధిలోని మంగళపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. పాఠశాల విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తోటి వారికి బోధించిన తీరు చూపరులకు ముచ్చట గొలిపింది. ఈ కార్యక్రమంలో భాగంగా ఎంఈవో, ప్రధానోపాధ్యాయులుగా బి. శరత్, కె. అశ్వితతో పాటు మరో 25 మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె. అలివేలు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో బోధనలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఉపాధ్యాయులు హన్మంత్, శ్రీనునాయక్, రాంచందర్, బన్సిలాల్, విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై విరిగిపడిన మర్రి చెట్టు


రహదారిపై పడిన మర్రి చెట్టు కొమ్మలు

చేవెళ్ల, మార్చి 4 : హైదరాబాద్ - బీజాపూర్ జాతీయ రహదారిపై సోమవారం రాత్రి ఓ పెద్ద మర్రి చెట్టు విరిగిపడింది. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. చేవెళ్ల మండల పరిధిలోని కేసారం స్టేజీ సమీపంలో జాతీయ రహదారిపై ఉన్న మర్రి చెట్టు సోమవారం రాత్రి 7 గంటల సమయంలో విరిగి ఒక్కసారిగా రోడ్డుపై పడిపోయింది. ఆ సమయంలో ఎలాంటి వాహనాలు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని పలువురు చెబుతున్నారు. చేవెళ్ల పోలీసులు జేసీబీ సహాయంతో ఆ చెట్టు కొమ్మలను తొలగించారు. కాగా రోడ్డుకిరువైపులా ఉన్న మర్రి చెట్లకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతోనే తరుచూ మర్రిచెట్లు విరిగి రోడ్డుపై పడుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ప్రమాదకరంగా ఉన్న చెట్లను తొలగించి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

ప్రతిపాదలనకే పరిమితమైన ఏసీపీ కార్యాలయం

- గతంలో డీజీపీ ఇచ్చిన హామీ అమలు కాని వైనం
- ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల మండలాల కోసం ప్రతిపాదనలు
- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిపై ఒత్తిడి

ఆమనగల్లు , మార్చి 4 : ఆమనగల్లు పట్టణంలో ఏసీపీ కార్యాలయం ఏర్పాటు ప్రతిపాదనలకే పరిమితమైంది. ఈ విషయంలో ఎవరూ చొరవ చూపడం లేదన్న ఆరోపణలున్నాయి. గత ప్రభుత్వంలో ఏసీపీ కార్యాలయం ఏర్పాటుకు అధికారులు చర్యలు చేపట్టారు. కడ్తాల మండల కేంద్రంలో నూతన పోలీసుస్టేషన్ భవనం ప్రారంభం సందర్భంగా నాటి హోంమంత్రి మహమూద్‌అలీ, డీజీపీ అంజన్‌కుమార్‌యాదవ్ రెండు మూడు రోజుల్లోనే కార్యాలయం ప్రారంభిస్తామని హామీ ఇచ్చిన కొద్దిరోజులకే అసెంబ్లీ ఎన్నికలు రావడం, ప్రభుత్వం, డీజీపీ మారడంతో అది మరుగున పడింది. ఆమనగల్లు, తలకొండపల్లి, కడ్తాల, మాడ్గుల మండలాలను కలిపి ఆమనగల్లులో ఏసీపీ కార్యాలయం ఏర్పాటుకు పోలీసులు ప్రతిపాదించారు. ప్రస్తుతం సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో ఆమనగల్లు, కడ్తాల, తలకొండపల్లి, రాచకొండ కమిషనరేట్ పరిధిలో మాడ్గుల పోలీస్ స్టేషన్లు కొనసాగుతున్నాయి. కాగా మాడ్గుల పోలీస్‌స్టేషన్‌ను సైబరాబాద్ పరిధిలోకి మార్చి ఏసీపీ కార్యాలయం ఏర్పాటుకు ప్రతిపాదించారు. కల్వకుర్తి నియోజకవర్గం పరిధిలో నాలుగు మండలాలుండగా ఆమనగల్లు, కడ్తాల, తలకొండపల్లి పోలీస్‌స్టేషన్లు షాద్‌నగర్ ఏసీపీ పరిధిలో, మాడ్గుల ఇబ్రహీంపట్నం ఏసీపీ పరిధిలో కొనసాగుతున్నాయి. దీంతో పాలనపరంగా ఇబ్బందులు కలుగుతున్నాయి. కమిషనరేట్లు వేర్వేరుగా ఉండడంతో ఇబ్బంది కలుగుతోంది. ఏసీపీ కార్యాలయం ఏర్పాటు చేయాలని చాలా కాలంగా ఈ ప్రాంత ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నారు. దీంతో పోలీసు శాఖ పరంగా ఆదిశగా గత ప్రభుత్వం కార్యాచరణ రూపొందించింది. షాద్‌నగర్ ఏసీపీ కార్యాలయం ఆమనగల్లుకు 50 కిలోమీటర్లు, ఇబ్రహీంపట్నం ఏసీపీ కార్యాలయం మాడ్గులకు 40 కిలోమీటర్ల దూరంలో ఉంది. దీంతో ప్రజలకు ఇబ్బంది కలుగుతోంది. ఒకే నియోజకవర్గంలోని నాలుగు మండలాలు రెండు కమిషనరేట్ల పరిధిలో ఉండడం సరికాదని, ఈ మండలాలను కలిపి ఆమనగల్లు కేంద్రంగా ఏసీపీ కార్యాలయం ఏర్పాటు చేస్తే ప్రజలకు సులభంగా ఉంటుందని స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పై ఈ ప్రాంత ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రజలు ఒత్తిడి తెస్తున్నారు.



ఆమనగల్లు పోలీస్‌స్టేషన్